AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

27-10-2026 (Tuesday)

MAIN EDITION

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని విశాఖపట్నంకు చెందిన రాజేశ్ (25) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. నాచారంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగానికి వెళ్తున్నాడు. అయితే మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న స్నేహితులను కలిసేందుకు సోమవారం వచ్చాడు. ఈ క్రమంలో దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

హైదరాబాద్‌లో భారీ శబ్దాలు




అక్షరటుడే, వెబ్‌డెస్క్ : హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భారీ శబ్దాలు వినిపించాయి. బ్లాస్టింగ్‌ను తలపించేలా సౌండ్లు వినిపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉప్పరపల్లి, ఎర్రగడ్డ, లంగర్ హౌస్, కేశవస్వామి నగర్‌లో ఉదయం 9.15 గంటల సమయంలో భారీ శబ్దాలు వచ్చాయి. ఒకేసారి నాలుగు ప్రాంతాల్లో భారీ శబ్దాలు స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం వచ్చిందేమోనని భయపడ్డారు. ఈ శబ్దాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

చంద్రశేఖరన్ నియామకం చెల్లదు : నోయెల్ టాటా



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ పునఃనియామకం చెల్లుబాటును నోయెల్ టాటా సవాలు చేశారు. టాటా ట్రస్ట్స్ చైర్మన్ అయిన నోయెల్ బోర్డు నిర్ణయ ప్రక్రియపై పలు ప్రశ్నలు లెవనేత్తారు. టీవీఎస్ మోటార్, చంద్రశేఖరన్ కుటుంబానికి సంబంధించిన ఒక కంపెనీతో ముడిపడి ఉన్న, బయటపెట్టని వ్యాపార లావాదేవీలపై ఆందోళన వ్యక్తం చేశారు.

మలబార్ గోల్డ్ షోరూమ్‌లో స్కాం తెలిస్తే షాకే..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ 'మలబార్ గోల్డ్ & డైమండ్స్' బిలాస్‌పూర్ షోరూమ్‌లో కస్టమర్‌ను నిలువునా మోసం చేసేందుకు యంత్రం లీడింగ్ మార్చిన వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. 22 క్యారెట్ల హాల్‌మార్క్ బంగారాన్ని 20 క్యారెట్లుగా చూపిస్తూ మోసానికి పాల్పడినట్లు తేలడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సెంచరీతో చెలరేగిన అభిషేక్




అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టీ 20లో భారత్ ఘన విజయం సాధించింది. భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. తొలివికెట్‌కు వీరు ఇద్దరు ఏకంగా 133 పరుగులు చేశారు. అభిషేక్ శర్మ సెంచరీ (113)తో రాణించాడు. న్యూజిలాండ్ 198 పరుగులు చేసింది.

సీఎం విజయ్‌పై స్టాలిన్ విమర్శలు



అక్షరటుడే, తమిళనాడు : తమిళనాడులోని తేని జిల్లాలో జైలు గోడలను బద్దలు కొట్టి ఖైదీలు పరారు అయిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో సీఎం విజయ్ ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి గురించి ఆయన మాట్లాడుతూ.. "బ్రేకింగ్ బ్యాడ్" తర్వాత, ఇప్పుడు తమిళనాడులో "ప్రిజన్ బ్రేక్" మొదలైందని ఎద్దేవా చేశారు. విజయ్ ప్రభుత్వాన్ని పనికిరాని ప్రభుత్వం అని అభివర్ణించారు. విజయ్ పాలనలో బయట ఉన్న నేరస్థులు స్వేచ్ఛగా నేరాలు చేస్తుంటే, జైలులో ఉన్న వారు తప్పించుకుంటున్నారని చురకలు అంటించారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీవో..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: ప్రపంచ స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీవోగా ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ ఉంది. మార్కెట్ నుంచి సుమారు రూ. 8.15 లక్షల కోట్లు(85.7 బిలియన్ డాలర్లు) సమీకరించింది. త్వరలో ఈ రికార్డును బద్దలు కొట్టడానికి ఆంథ్రోపిక్ సిద్ధమయ్యింది. ఇందుకోసం అక్టోబర్ 26న అమెరికాలోని రెగ్యులేటరీకి ఎస్ 1 పత్రాలు దాఖలు చేసింది. ఈ కంపెనీ మార్కెట్ ఉంచి 100 బిలియన్ డాలర్ల వరకు నిధుల్ని సమీకరించాలని యోచిస్తోంది. ఏఐకి డిమాండ్ ఉండడంతో ఈ పబ్లిక్ ఇష్యూ స్పేస్ ఎక్స్‌ను అధిగమించే అవకాశాలున్నాయి.

బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాన్ తీరం దిశగా వేగంగా దూసుకొస్తుంది. దీంతో ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. మరోవైపు సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు విరుచుకుపడుతున్నాయి. ఇప్పటికే ఏపీలోని పలు జిల్లాల్లో వర్షా లు కురుస్తున్నాయి. దీంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



వణికిస్తున్న తుపాన్

■ తీరంవైపు దూసుకొస్తున్న అర్నబ్ సైక్లోన్ ■ ఉత్తరాంధ్రలో తీవ్ర గాలులు ■ అల్లకల్లోలంగా సముద్రం ■ అప్రమత్తమైన ప్రభుత్వం

తుపాన్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తీరానికి సుమారు 500 కిలోమీటర్ల దూరంలో ఉంది. బుధవారం ఉదయం కోనసీమ ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరాన్ని తాకే సమయంలో గంటకు 200-250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తుపాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. కాకినాడ జిల్లా ఉప్పాడలో అలల తాకిడికి తీరం కోతకు గురైంది. శ్రీకాకుళం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం పడుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సముద్ర తీరానికి వెళ్లొద్దని హెచ్చరించారు.

రైళ్లు రద్దు.. బడులకు సెలవు

తుపాన్ ఎఫెక్ట్‌తో ఏపీలోని పలు జిల్లాల్లో రైళ్లు రద్దు చేశారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. సహాయక చర్యల కోసం రూ. 27 కోట్లను విడుదల చేశారు. సౌత్ కోస్ట్ రైల్వే 53 రైళ్లను రద్దు చేసింది. ఏపీ ప్రభుత్వం విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్టోబర్ 27, 28 తేదీలలో సెలవులు ప్రకటించింది. అనకాపల్లి జిల్లాలో అక్టోబర్ 27 నుండి 29 వరకు పాఠశాలలు మూసి ఉంచాలని ఆదేశించింది. దీని ప్రభావంతో కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

తెలంగాణలో..

తుపాన్ ప్రభావం తెలంగాణపై సైతం ఉండనుంది. తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. మిగతా జిల్లాల్లో అక్కడ వర్షాలు పడుతాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రైతులు పంట కోతలు, ధాన్యం ఆరబోత సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

బీచ్‌ల మూసివేత

అర్నబ్ తుపాన్ ఎఫెక్ట్‌తో సముద్రం అల్లాకల్లోలంగా మారింది. అలలు విరుచుకుపడుతున్నాయి. విశాఖపట్నం పోలీసులు ప్రజలను తీర ప్రాంతం నుండి ఖాళీ చేయాలని అనౌన్స్ చేస్తున్నారు. అన్ని బీచ్‌లను మూసివేశారు. స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పర్యాటకులు బీచ్‌లకు రావొద్దని హెచ్చరించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) రాష్ట్ర, జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది.

'కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసిన హరీశ్‌రావు'



అక్షరటుడే, హైదరాబాద్ : మాజీ మంత్రి హరీశ్‌రావుపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయిందన్నారు. హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉండి కాళేశ్వరం కూలేశ్వరం చేశారని విమర్శించారు. హరీశ్ రావుకు కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ గురించి మాట్లాడితే కోపం వస్తుందని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ నుంచి 20 వేల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయని హరీశ్‌రావు అంటున్నారని, వాటిని ఎలా ఎత్తిపోయాలని ఎంపీ ప్రశ్నించారు. నీరు ఎత్తిపేసేంత నీటిమట్టం లేదన్నారు. వచ్చే నీటిని నిల్వ చేసి, ఎత్తిపోదామంటే బ్యారేజీ కూలిపోయిందన్నారు.

ఇయర్ ఫోన్లు పెట్టుకునేవారికి సీపీ సజ్జనార్ సూచన



అక్షరటుడే, హైదరాబాద్ : ఇయర్ ఫోన్లు పెట్టుకునే వారికి సీపీ సజ్జనార్ పలు సూచనలు చేశారు. డ్రైవింగ్ చేసే సమయంలో, రోడ్లపై నడుచుకుంటు వెళ్తున్నపుడు ఇయర్ ఫోన్లు పెట్టుకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రైల్వే ట్రాక్‌పై ఇయర్ ఫోన్‌లు పెట్టుకొని ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొన్న వీడియోను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. నిండు జీవితం కంటే ఆ ఫోన్ కాల్ ముఖ్యమ అన్నారు. ఇయర్ ఫోన్లు చుట్టూ ఉన్న ప్రపంచంతో ఉన్న సంబంధాన్ని పూర్తిగా తెంచేస్తాయన్నారు.

నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు : వైఎస్ జగన్



అక్షరటుడే, ఏపీ : నామినేషన్ వేసేందుకు వెళ్తున్న మహిళలను అడ్డుకుంటున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఆర్వో ఆఫీసుకు వెళ్లేలోపే దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. 40 వార్డులు ఉన్న పులివెందులలో 20 వార్డులకు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. నామినేషన్లు వేయించాలని కోరితే పోలీసులు లాఠీఛార్జ్ చేశారన్నారు.

ఫాస్టాగ్ లోకల్ పాస్‌లపై ఆఫర్




అక్షరటుడే, ఢిల్లీ : జాతీయ రహదారులపై నిత్యం ప్రయాణించే వాహనదారులకు, ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసించే స్థానిక ప్రజలకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తీపి కబురు అందించింది. 'ఫాస్టాగ్ యానువల్ పాస్' విధానంలో పలు కీలక మార్పులు చేస్తూ నూతన మార్గదర్శకాలతో అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కొత్త నిబంధనలు నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తూ, ఫాస్టాగ్ కలిగిన స్థానిక వాహనదారులకు రాయితీ వార్షిక పాస్‌లను పొందేందుకు ప్రభుత్వం అర్హత కల్పించింది.

కాంగ్రెస్ ర్యాలీపై వ్యాపారుల ఆందోళన



అక్షరటుడే, ఢిల్లీ : కాంగ్రెస్ తలపెట్టిన ర్యాలీపై ఢిల్లీలోని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 1న దేశ రాజధానిలో ఇండియా బ్లాక్ ప్రతిపాదిత నిరసన ర్యాలీని దీపావళి తర్వాతకు వాయిదా వేయాలని వారు కోరుతున్నారు. రామ్‌లీలా మైదాన్‌లో 10 లక్షల మందితో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనకు ఇండియా కూటమి పిలుపునిచ్చింది. పండుగ సమయంలో నిరసన కార్యక్రమాలతో తమ వ్యాపారం దెబ్బతింటుందని దుకాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు.

రెండేళ్ల ప్రాయంలోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌స్‌లో చోటు



అక్షరటుడే, కర్ణాటక: కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాకు చెందిన స్వరశ్రీ హెగ్డే అనే చిన్నారి సంగీత ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కేవలం 2 సంవత్సరాల 10 నెలల పసి వయసులోనే తబలాపై 12 రకాల తాళాలను స్వరబద్ధంగా వాయిస్తూ, నోటితో లయబద్ధమైన బోల్స్ పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' లో చోటు సంపాదించుకుంది. ఆమె తండ్రి గురురాజ్ హెగ్డే ప్రముఖ తబలా విద్వాంసుడు కాగా, తల్లి శ్రీలత ఇంగ్లీష్ ప్రొఫెసర్, హిందుస్థానీ గాయని.

మైక్రోసాఫ్ట్‌లో 60 వేల మందికి ఎగ్జిట్ ఆఫర్ ..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ భారీగా ఉద్యోగులను తగ్గించుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా లేఆఫ్‌లకు బదులుగా వలంటరీ ఎగ్జిట్ ఆఫర్(వీఈవో) ను తీసుకువచ్చింది. భారత్‌తో సహా 4 దేశాల్లోని 60వేల మంది ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ అవకాశాన్ని ప్రకటించినట్లు పేర్కొంది. ఇది కంపెనీ ఉద్యోగులలో దాదాపు 27 శాతానికి సమానం. 2026 జూన్ నాటికి కంపెనీలో పూర్తికాల ఉద్యోగుల సంఖ్య 2.23 లక్షలు. ఇందులో 1.21 లక్షల మంది యూఎస్‌లో పనిచేస్తుండగా.. మిగిలినవారు వివిధ దేశాలలోని కార్యాలయాలలో సేవలందిస్తున్నారు.